సీరియల్

రక్తం త్రాగే పిశాచం

వసుంధర

(గత సంచిక తరువాయి)

“అలా నవ్వకు—” అన్నాడు కోదండం.

“మరేం చేయను? ఇంకోలా నవ్వడం నాకు రాదు..” అంది వకుళ.

"అయితే నవ్వడం మానేయ్ ...." అన్నాడు కోదండం.

వకుళ కోదండాన్ని తినేసేలా చూసింది—"మొదటిన్నించీ వెధవ బుద్ధే నీది—నువ్వు సంతోషంగా ఉండడం కోసం నేను నవ్వడం మానేయాలా? నా యిష్టం—నేను నవ్వుతాను...." అంటూ వకుళ ఆగకుండా నవ్వసాగింది.

కోదండానికి ఆ నవ్వు భరించ శక్యం కాకుండా ఉంది.

"వకుళా—ప్లీజ్—" అన్నాడతను.

ఆమె నవ్వు ఆపలేదు.

"వకుళా!" అరిచాడతను.

వకుళ నవ్వు ఆపేసి—"నలుగురూ వచ్చి ఏదో జరిగిందనుకుంటారు. ఒక్క ముక్క చెప్పడానికి వచ్చాను. నువ్వేం సుఖపడ్డా ఈ నర్సింగ్ హోంలోనే! ఇందులోంచి బయట పడగానే ప్రతి క్షణం నరకం చూస్తావు" అంటూ వెనుదిరిగింది.

ఇంతలో ఆ గదిలోకి ఓ నర్సు పరుగున వచ్చి—"ఏం జరిగింది?" అనడిగింది.

"ఏమీ లేదు. మా మామయ్య ఆడది నవ్వితే చూడలేడు—" అని అక్కణ్నించి బయటపడింది. ఆమె హాల్లోకి వచ్చేసరికి ఇందాకటి వ్యక్తి ఇంకా అక్కడే కూర్చుని ఉన్నాడు.

"హలో!" అంటూ వకుళే అతన్ని పలకరించింది.

అతనులిక్కిపడి ఆమెను చూసి మరింత ఉలిక్కిపడి—"మీకు.... మీకు.... ఏం కావాలి?" అన్నాడు.

"నాకేం అక్కర్లేదు. మీకింకేమైనా కావాలేమో తెలుసుకుందామని వచ్చాను...." అంది వకుళ.

"అబ్బే.... నాకేమీ వద్దు...." అన్నాడతను.

"గుడ్.. కీ పిటప్...." అని అక్కణ్నించి రోడ్డు మీదకు వచ్చింది వకుళ.

అప్పుడు ముందు బట్టల షాపుకి వెళ్ళిందామె. ముందు రోజు కౌంటర్లో ఉన్న వ్యక్తి ఆమెను చూసి గుర్తుపట్టి ఉలిక్కిపడ్డాడు.

"హలో! రతన్‌లాల్‌కి ఫోన్ చేసి డబ్బు తీసుకున్నారా?" అందామె.

"లేదు...."

"చెంప దెబ్బ తినేసరికి మీకు మతిపోయినట్లుంది. ఇలాగైతే వ్యాపారమేం చేస్తారు?" అంది వకుళ.

అతను నీళ్ళు నమిలాడు....

"చూడండి మిస్టర్...." అని ఆగిందామె. అప్పుడతను తన పేరు సత్యారావు అని చెప్పాడు.

"చూడండి మిస్టర్ సత్యారావ్! నేను మిమ్మల్ని కొట్టింది డబ్బు లెగవేయడానికి కాదు. ఆడవాళ్ళని చిన్న మాటలని తేలిక చేయకుండా ఉండడానికి. నాకు మీ షాపులో వెరైటీ నచ్చింది. అన్నీ ఇక్కడే కొనాలనుకుంటున్నాను. డబ్బు రతన్‌లాల్ ఇస్తాడు. ఎందుకైనా మంచిది—ఇప్పుడే ఓ మనిషిని ఆయన ఇంటికి పంపండి. ఇల్లంటే ఆయన పెళ్ళాం బిడ్డలుండేది కాదు. ఆయన తన కోసం ప్రత్యేకంగా కట్టించుకున్న బంగళా లేదూ.... అది.... నేనిక్కడే బట్టల బేరం చూస్తూంటాను. మీ మనిషిని టాక్సీలో పంపి మూడు వేలు తెప్పించండి. టాక్సీ డబ్బులు నాదేలెండి...." అని నవ్వి లోపలకు వెళ్ళింది వకుళ.

అతను ముందు కాస్త తెల్లబోయినా తర్వాత తేరుకుని

ఓ మనిషిని పంపించాడు. అతడికి వకుళ ఓ చీటీ రాసిచ్చింది. ఆమె ఏం రాస్తుందోనని ఆత్రుతగా చూస్తున్న సత్యారావు ఉలిక్కిపడ్డాడు.

"రతన్‌లాల్! ఈ రోజు నీ రక్తం తాగుతాను. ఇతడికి మూడువేలిచ్చి పంపించు—వకుళ!"

చీటీ తీసుకుని ఆ కుర్రాడు వెళ్ళిపోయాడు. సత్యారావు మాత్రం ఆలోచనలో పడిపోయాడు.

ఎవరీ వకుళ! ఏమి ఈమె అసాధారణ ప్రవర్తన? నిన్న ఆమె తనను కొట్టిన దెబ్బ సామాన్యమైనదికాదు. కుసుమ కోమలమైన ఆమె చిన్నారి చేతుల్లో అంత బలముంటుందని ఎవ్వరూ ఊహించలేరు. ఇప్పుడీమె రతన్‌లాల్‌కు రాసిన ఉత్తరం కూడా చిత్రంగా వుంది.

అందులోని భాషకు అర్థమేమిటి? వకుళ రతన్‌లాల్ని బ్లాక్‌మెయిల్ చేస్తోందా? రక్తం తాగుతానంటే అర్థమేమిటి? అదేమైనా కోడ్ భాషా?

లోపల వకుళ బేరం అవుతూండగా వెళ్ళిన కుర్రాడు మూడువేలూ తీసుకుని వచ్చాడు.

సత్యారావు ఆ కుర్రాణ్ని నెమ్మదిగా అడిగాడు—"ఆ చీటీ చూశాక రతన్‌లాల్ ప్రవర్తన ఎలా ఉంది?"

ఆ కుర్రాడు కూడా నెమ్మదిగానే చెప్పాడు—"ఆయన ఆ ఉత్తరం చూసి చాలా సంతోషపడ్డాడండి. మూడుసార్లు ఆ చీటీని ముద్దుపెట్టుకున్నాడండి. నాకు పది రూపాయలు బహుమతి కూడా ఇచ్చాడండి—"

సత్యారావు ఆశ్చర్యపడ్డాడు. తన అంచనా ప్రకారం రతన్‌లాల్ ఆ చీటీ చూసి కలవరపడాలి. జుట్టు పీక్కోవాలి. ఒకవేళ బయటివాడి దగ్గర దొరికిపోకూడదని లోపలి భావాలు దాచుకున్నప్పటికీ—ఆ చీటీ

చూసి సంతోషించే అవకాశం ఏమాత్రమూ లేదు. అందులోనూ ఆయన ఈ కుర్రాడికి పది రూపాయల బహుమతి కూడా ఇచ్చాడు అంటే—ఆ చీటీ ఆయనకు సంతోషాన్ని కలిగించింది. రతన్‌లాల్ మనస్ఫూర్తిగానే మొత్తం మూడు వేలూ ఇప్పుడిచ్చాడు.

చటుక్కున సత్యారావుకు ఏదో స్ఫురించింది. ఈ వకుళ శృంగారాధి దేవత అయుండాలి. మగవాడిని తృప్తిపరచడంలో ఆమెకు ఎన్నో కొత్త విద్యలు తెలిసి ఉండాలి. అందువల్లనే రతన్‌లాల్ ఈమెకు దాసు డయ్యాడు. రక్తం తాగడమనేది వారిద్దరి మధ్య— శృంగారానికి సంబంధించిన ఏదో కోడ్ అయుండాలి. అతనప్పటికప్పుడు ఆ కోడ్‌ను డీకోడ్ చేయడానికి ప్రయత్నించసాగాడు. అది మానసికంగా అతడికి మంచి తృప్తిని స్తున్నట్లుంది. కానీ ఒకరిద్దరు కస్టమర్స్‌కు చిల్లర ఎక్కువిచ్చేశాడు.

వకుళ ఆ రోజు మరో నాలుగు చీరలు కొన్నది. అర డజను లంగా గుడ్డలు, నాలుగు జాకెట్టు గుడ్డలు తీసుకుని-నిన్నటిదీ, ఆ రోజుదీ కలిపి డబ్బు ఇచ్చేసింది. సేల్స్ బాయిలంతా ఆమెతో ఆ రోజు చాలా జాగ్రత్తగా వ్యవహరించారు.

ఆమె డబ్బు ఇస్తుంటే సత్యారావామెను పరీక్షించి చూశాడు. మనిషి చాలా అందమైనది. ఈ అందం, అవయవాల పొందిక—రతన్‌లాల్ వంటి వాడి దగ్గర వృథా అయిపోకూడదు. తన అదృష్టం కూడా పరీక్షించుకుంటే....

వీలైనంతగా స్వరం తగ్గించి—"మిస్! మరోలా అనుకోకండి—మీరు నా రక్తం తాగరూ?" అన్నా

డతను. ఆ నేసి ఆమె చేతికి అందనంత వెనక్కి-వెళ్ళాడు.

వకుళ నవ్వింది. ఎప్పటిలాగే నెమ్మదిగా, భయంకరంగా........అక్కడున్న వారి నందర్నీ ఆకర్షించే విధంగా!

అక్కణ్ణించి వెళ్ళిపోతూ—"నా కింకా చిల్లర వస్తుంది. కానీ మరోసారి తీసుకుంటాలెండి!" అంది.

తరువాత ఆమె టైలరింగ్ షాపుకి వెళ్ళి—"నిన్న నీ పేరడగడం మరిచాను—" అంది.

"రాజబాబు—"

"మిస్టర్ రాజబాబూ—నా బట్టలు కుట్టేవా?" అందామె.

"మా షాపులో టైముంటే టైమే—" అంటూ ఆమె జాకెట్స్ ఇచ్చాడు.

"ట్రయల్ రూముందా?"

"ఉంది—"

వకుళ ట్రయల్ రూంలోకి వెళ్ళి జాకెట్ వేసి చూసుకుంది. ఆమెకు తృప్తిగానే అనిపించింది.

షాపులోనే లంగా గుడ్డలు, జాకెట్ గుడ్డలు ఇచ్చి యెలా కుట్టాలో చెప్పింది.

"మిస్టర్ రాజబాబూ నాకో చిన్న హెల్ప్ చేసి పెడతావా?"

"చెప్పండి—"

"జాకెట్లు కుట్టావు కదా—దాన్నిబట్టి నాకే నెంబరు బ్రా కావాలో నీకు తెలుస్తుంది. డబ్బులిస్తాను—మంచి కంపెనీవి ఓ అరడజను బ్రాసరీలు తెప్పించిపెట్టు. నాకు నెంబరు తెలియదని ఆశ్చర్యపోకు. ఇంతవరకూ నేనవి

వాడలేదు—"

ఆమె మాటలు రాజబాబుకు చాలా ఆశ్చర్యాన్ని కలిగించాయి. కానీ అతనేమీ అనకుండా ఆమె దగ్గర డబ్బు తీసుకుని—తన కొట్లో కుర్రాడికి నెంబరు చెప్పి పంపించాడు. కుర్రాడు ప్యాకెట్ తెచ్చి యివ్వగానే— ఆమెకు అందించి—"మీరు చాలా విచిత్రమైన మనిషిలా ఉన్నారు. నిన్న జరిగింది కలో, నిజమో ఇంతవరకూ నమ్మలేకుండా ఉన్నాను—" అన్నాడు రాజబాబు.

"ఆ సందేహం తీర్చడం పెద్ద లెక్కలోది కాదు— ట్రయల్ రూంలోకి పద—" అందామె.

ఇద్దరూ అక్కడకు వెళ్ళాక ఆమె అక్కడి కిటికీ తలుపులు తీసింది. నాలుగుండవలసిన చోట మూడే ఊచలున్నాయి. వకుళ మరో ఊచను లాగి దారంలా ఉండచుట్టేసి క్రింద పడేసి—"కలో, నిజమో యిప్పుడు తెలిసిందా నీకు?" అనడిగింది.

రాజబాబుకు నోట మాటరాలేదు. అతను కన్నార్పకుండా ఆమెవంకా, క్రిందపడి వున్న ఊచవంకా చూడసాగాడు.

వకుళ అతడి చేతిలో పాతికరూపాయలు పెట్టి— "ఇది కట్టుకూలి కాదు. కిటికీకి కొత్త ఊచలు వేయించుకో—" అని అక్కణ్ణించి బయటకు వచ్చేసిందామె. ఆ తర్వాత వకుళ తిన్నగా ఇల్లు చేరింది. లోపలకు వెళ్ళి గడియ వేసింది. తన గదిలోకి వెళ్ళి దీపం వేసింది.

గదిలో మధు కూర్చుని వున్నాడు.

"నువ్విక్కడున్నావా?" ఆశ్చర్యంగా అంది వకుళ.

"వచ్చేసరికి కాస్త ఆలస్యమైంది. నువ్వెక్కడి

కళ్ళావో తెలియదు. నిన్ను చూడకుండా ఉండలేక యిక్కడ యీ గదిలో కూర్చున్నాను—" అన్నాడు మధు.

వకుళ అతడివంక ఆప్యాయంగా చూసి—"రక్తం తెచ్చావా?"

"అదెంత సేపు. క్షణంలో పనైపోయింది—" అంటూ మధు ఆమెకు రక్తపు సీసా యిచ్చాడు. వకుళ ఒక్క గుక్కలో ఆ రక్తం తాగి—"మధూ! నీ మేలు మరువలేను. స్నానానికి ఈ ద్రావకం దొరకడంలో నేనిప్పుడు పగలు కూడా బయటకు రాగల్గుతున్నాను. ఇంక నాకే అడ్డంకులూ లేవు. ఎప్పుడు ఎక్కడ కావలన్నా యథేచ్ఛగా సంచరించగలను—" అంది. ఉత్సాహంతో ఆమె నవ్వగా మధు కూడా శృతికలిపాడు.

"నువ్వు నవ్వకు—" అంది వకుళ. అతడి నవ్వు ఆమెకు నచ్చలేదు.

మధు వెంటనే నవ్వు ఆపేశాడు.

"మధూ! ఈ ఇల్లు మనకు శాశ్వతం కాదు. నువ్వు నా కోసం ఒక మంచి ఇల్లు చూడు. వీలయితే అది కొనేసుకుందాం. లేదా అద్దెకు ఉందాం. మనిద్దరం ఒక చోటే ఉందాం—మనం సాధించాల్సిన పనులు ఎన్నో వున్నాయి. నీకు నచ్చిన ఇల్లొకటి తొందరగా చూడు. ఇంట్లో కనీసం నాలుగు గదులుండాలి. అన్నీ విశాలంగా ఉండాలి. ఒక విశాలమైన బాత్‌రూం—అన్నీ ఆధునిక సౌఖర్యాలతోటీ వుండాలి. ఇక్కడ నేనింక ఎన్నాళ్ళో ఉండలేను—" అంది వకుళ.

"అలాగే వకుళా—మరి నేను వెళ్ళొస్తాను...." అన్నాడు మధు.

"మంచిది. వెళ్ళిరా!" అంది వకుళ.

"కానీ...."అని ఆగాడు మధు.

"ఏమిటి?"

"వకుళా, ప్లీజ్ ....ఒక్కసారి నా రక్తం తాగవూ?" అన్నాడు మధు. అతడి కళ్ళు ఆమెని అర్థిస్తున్నాయి.

వకుళ మధువంక అదోలా చూసి—"అది తప్పు ఇంకేమైనా అడుగు—" అంది.

"అయితే...." అని ఆగాడు మధు.

"చెప్పు...."

"నువ్వు స్నానం చేస్తూంటే చూడాలని ఉంది—" తడబడుతూ అన్నాడు మధు.

వకుళ అతణ్ని సమీపించి—"కాస్తోకూస్తో నీకు ఇంకా నా మీద ప్రేమ వుంది—" అంటూ అతడి బుగ్గలపై మృదువుగా ముద్దు పెట్టుకుంది. "సరే—నీ కోరిక తీరుతుంది—" అంటూ గాలిలోకి ఎగిరింది.

మధు ఆమెవంక ఆత్రుతగా చూస్తున్నాడు.

చూస్తూండగా గాజు సిలెండర్లో పై మూత గాలిలోకి తేలింది. అందులోని బొమ్మ పైకి ఎగిరి గదిలో ఓ మూలకు వెళ్ళిపోయింది. వకుళ వంటిమీదనుంచి ఒకో వస్త్రమే రాలి నేలమీద పడింది. ఆమె గాజు సిలెండర్లోకి దిగింది. వెంటనే పైన మూత వేసుకుంది.

మధు రెప్పలార్పకుండా వకుళ సౌందర్యాన్ని చూశాడు. ఆమె మానవ కన్యలా లేదు. దేవకాంతలాగున్నది.

ముఖంనుంచి కాళ్ళవరకూ ఆ సౌందర్యంలో ఎక్కడా ఏ లోపమూ లేదు.

ఒకానొకప్పుడీ వకుళ తన్ను ప్రేమించింది. తను

వివాహానికి సిద్ధపడితే ఆమె భార్య కావడానికి సిద్ధపడింది. అప్పట్లో తన ఊహాలు వేరే ఉన్నాయి. చూస్తూ చూస్తూ ఒక అభాగ్యురాలి మెటలో తాళి కట్టడం ఇష్టం లేకపోయింది. అవకాశం వస్తే ఉపయోగించుకుందామనే కాచుకుని కూర్చున్నాడు. అవకాశం రాలేదు.

ఇప్పుడు అవకాశం పూర్తిగా పోయింది. ఆమె ఎప్పటికీ తనది కాలేదు. కానీ తను ఆమె వశమైపోయాడు. ఆమె ఎలా చెబితే అలా నడుచుకుంటున్నాడు.

కానీ ఇంత అందం ఎవరికీ కాకుండా పోయింది.

ఈ తప్పు ఎవరిది?

వకుళ ద్రావకంలో కేరింతాలు కొడుతోంది. నవ్వుతోంది. గాజు జాడీలోంచి ఆమె మాటలు సన్నగా వినపడుతున్నాయి. అసలే భయంకరంగా ఉండే ఆమె నవ్వు గాజు జాడీలోంచి వింటూంటే మరింత సన్నబడి ఇంకా భయంకరంగా ఉంది.

వకుళ ఆ గాజు జాడీలో పైకీ క్రిందికీ కదుల్తోంది. దేవతాశిల్పి మలిచిన అద్భుతమైన పాలరాతి శిల్పంలా మెరిసిపోతోందామె. ఆ అందాన్ని చూస్తూంటే— మనిషి బట్టను కనిపెట్టడంవల్ల ప్రపంచంలో సౌందర్యానికి తీరని అన్యాయం జరిగిందనిపిస్తుంది. కొంతమంది బట్టలు వేసుకున్నప్పుడు బాగుంటారు. కొందరు బట్టలు లేనప్పుడు బాగుంటారు. కొందరు రెండు విధాలా బాగుంటారు.

వకుళ సౌందర్యం తలచుకుంటే మధుకు దుఃఖం వచ్చింది. అతడు ఆగకుండా ఏడ్వనారంభించాడు.

వకుళ కేరింతలు ఆపి—"యేమయింది మధూ....!" అంది.

"నువ్వు....నువ్వు....యెవరికీ కాకుండా....యెందుకూ కాకుండా....అయిపోయావు. ఇది నా కెంత బాధ కలిగిస్తోందో నీ కర్థంకాదు...." అన్నాడు మధు.

వకుళ ద్రావకంలో కూర్చుంది.—"మధూ! గత జల సేతు బంధనం అనవసరం. నీకు నా గురించి బాధగా వుంటే నువ్వు కూడా నాకులాగే ఎవరికీ కాకుండా ఎందుకూ కాకుండా అయిపో!"

"అలా అయిపోవాలనే నా కోరిక—"

"సరే—ఇంక వెళ్ళు—"

మధు వెళ్ళిపోగానే వకుళ తిరిగి ద్రావకంలో కేరింతలు కొట్టసాగింది.

19

"ఆ బుగ్గలమీద రక్తపు మరకలేమిట్రా—" అంది మధు తల్లి.

"ఎక్కడమ్మా — నాకేమీ కాలేదే?" అన్నాడు మధు.

"బాగానే వుంది. నీ వంటికి గాయమైనా నీకు తెలియడంలేదన్నమాట! నీ గురించి నాకు బెంగగా వుంది. కొద్ది రోజులుగా నీ ప్రవర్తన ఏదోలాగుంటోంది—" అంటూ ఆవిడ కాసిని నీళ్ళు తీసుకుని వచ్చి కొడుకు బుగ్గలు—తడి కొంగుతో తుడిచింది. అయితే ఆవిడ ఆశ్చర్యపోయేలా ఆ రక్తపు మరకలు మాయమయ్యాయి.

"అయితే నీకేం దెబ్బతగల్లేదన్నమాట—మరి ఆ రక్తపు మరకలెక్కణ్నించి వచ్చాయి!"

మధు తల్లిని కసిరాడు — "మగాణ్ని—లక్ష పనులు నాకు....నువ్వు నన్నేమీ అడగొద్దు—"

అయితే తల్లి బెదరలేదు—"నువ్వు మగాడివేకావచ్చు.

కానీ నేను నీకు తల్లిని. నవ మాసాలు మోసి—ఓర్పుతో పెంచితే—ఇప్పటికింతవాడివయ్యావు. నిన్న నువ్వు నాకు అంత డబ్బివ్వగానే అనుమానం వచ్చింది. నువ్వు కాని పని ఏదో చేస్తున్నావని. నిన్న డబ్బుకి రక్తం అంటుకుంది. ఏదో ఓ రోజున నువ్వు కటకటాల వెనక్కి వెడతావు. మగాణ్ని... నాకు లక్ష పనులుంటాయంటే పోలీసులూరుకోరు. చావదన్ని నిజం కక్కిస్తారు. నువ్వేం చేస్తున్నావో నాకు చెప్పు. మంచిచెడ్డలు విచారించి చెబుతాను. అది నా బాధ్యత. నా కర్మకొద్దీ ఈ సమయంలోనే ఆయన ఆఫీసు టూర్లో వున్నారు. ఆయన వచ్చేదాకా నీ బాధ్యత నాది. తర్వాత అన్నీ ఆయనే చూసుకుంటారు—"

మధు కాస్త తగ్గి—"చెప్పడానికేమైనా వుంటే నేనే చెబుతాను కదమ్మా—" అన్నాడు.

"నువ్వా రతన్‌లాల్ దగ్గర పనిచేస్తున్నావు. ఆయన నీకు రోజూ వందలకు వందలిస్తాడు. డబ్బున్నవాళ్ళ ఔదార్యాన్ని నేను నమ్మను. ఆయన నీవల్ల అంతకంతా ప్రతిఫలం పొందుతున్నాడు. ఆ విధంగా నువ్వు బలైపోతున్నావని నా అనుమానం. అందుకే నేను నిన్ను నిలదీస్తున్నాను—" అంది మధు తల్లి.

"బాగుందమ్మా — నువ్వన్నీ తప్పుగా అర్థం చేసుకుంటున్నావు. రతన్‌లాల్ చాలా పెద్దమనిషి. ఆయన నాకు డబ్బిస్తున్నాడంటే—వెధవ పనులు చేయమని కాదు. వకుళ గురించి - ఆ రతన్‌లాల్ వకుళ బానిస!" అన్నాడు మధు.

మధు తల్లి ముక్కుమీద వేలేసుకుని—"ఏమన్నావ్? ఆఖరికాపిల్ల ఇలా తయారయిందా? సిగ్గూ, శరం వది

లేసిందన్నమాట! అయితే నువ్వసలాపిల్లతో ఇంక తిరగటానికి వీల్లేదు. జీవితంలో డబ్బొక్కటే ముఖ్యంకాదు. నా మాట విను. నాలుగు రోజులు ఇల్లు కదలకు—" అంది.

"అమ్మా-వకుళ నేమైనా అనుకుంటే కళ్ళు పోతాయి. ఆ పిల్ల నిప్పులాంటిది ...." అన్నాడు మధు.

"నిప్పులాంటి పిల్లయితే రతన్‌లాల్ దానికి బానిస ఎందుకౌతాడు—నీ వెర్రిగానీ!" అంది మధు తల్లి.

ఆ ప్రశ్నకు జవాబివ్వకుండా-"వకుళ నిప్పు. అందులో సందేహంలేదు—" అన్నాడు.

"డబ్బు లేని నీలాంటి వెధవలకు అది నిప్పులాగే వుంటుంది. దానిఅసలు రంగు డబ్బున్నవాళ్ళకే తెలుసుంది—" అంది మధు తల్లి. ఆమె ఇంకా ఆ మాటలు పూర్తి చేయకుండానే — ఎవరో చెవి దగ్గర గుసగుసలాడినట్లు—"అత్తయ్యగారూ!" అని వినిపించింది.

ఆ పిలుపుకి ఆవిడ ఉలిక్కిపడింది.

మళ్ళీ చెవుల దగ్గర అదే పిలుపు వినిపించింది.

"ఎవరూ?" అని అరిచింది మధు తల్లి.

"నేను — వకుళను—" స్వరం గుసగుసలాడినట్లే వుంది.

"వకుళా—ఇలా వచ్చావేం?" అన్నాడు మధు.

"నీ బుగ్గలమీదకు రక్తం ఎలా వచ్చిందో మీ అమ్మగారికి చెబుదామని—!" అంది వకుళ.

తన వెనకనే నిలబడివున్న వకుళను చూసింది మధు తల్లి. తడబడుతూ—"నువ్వెప్పుడొచ్చావమ్మా!" అంది.

"మధు వెనకాలే నేనూ వచ్చాను. నా గురించి మీరేమనుకుంటున్నారో తెలుసుకోవాలనిపించి—రహస్యంగా

మీ మాటలు విన్నాను. పాపం మధు తప్పేంలేదు. రక్తం తాగే పిశాచానిక్కూడా అతడంటే ముద్దువచ్చి రెండు బుగ్గలమీద ముద్దుపెట్టుకుంది. దాని పెదాల రక్తం అంటుకుంది—" అంది వకుళ.

"నువ్వేమంటున్నావో నాకర్థం కాలేదు—" అంది మధు తల్లి. వకుళ తననేదో వేళాకోళం చేస్తోందని ఆమెకు అనుమానం వచ్చింది.

"మీ ఇంట్లో ఆడా, మగా కలిసి తీయించుకున్న ఫోటోలేమైనా వుంటే తీసుకురా మధూ!" అంది వకుళ.

"ఏమిటమ్మా నీ అథార్టీ!" అంది మధు తల్లి చిరాగ్గా.

"ముందు మధును ఫోటో తీసుకురానీండి—" అంది వకుళ.

మధు లోపలకు వెళ్ళి ఓ ఫోటో తీసుకువచ్చాడు. ఏదో పెళ్ళిలో తీయించుకున్న ఫోటో అది. అందులో నలుగురు చిన్నపిల్లలూ, అయిదుగురు మగాళ్ళూ నలుగు రాడవాళ్ళూ వున్నారు.

"ఆ ఫోటో ఓసారి మీ అమ్మకు చూపించు—" అంది వకుళ. మధు వెంటనే ఫోటో తల్లికిచ్చాడు. వకుళ మళ్ళీ గుసగుసలాడుతున్నట్లుగా — "అత్తయ్యగారూ" అంది.

ఆ పిలుపు మధు తల్లికి నచ్చలేదు. ఉలిక్కిపడినట్లు వకుళను చూసిందావిడ.

"అందులో ఎవరెవరున్నారో బాగా గుర్తుపెట్టుకోండి. నాకోసారి ఆ ఫోటో ఇలా ఇవ్వండి—" అని ఆవిడ ఇచ్చేలోగా తనే బలవంతంగా ఆవిడ దగ్గర్నుంచి ఫోటో తీసుకుంది.

మరుక్షణం అక్కడ కాగితం కాలిన వాసన వేసింది.

వకుళ ఆ ఫోటోను మధు తల్లికిచ్చేసి గుసగుసలాడుతున్నట్లుగా మళ్ళీ—"అత్తయ్యగారూ!" అంది. ఆమె అలా పిలిస్తే మధు తల్లికి గుండెలోంచి బెదురు పుట్టుకొస్తోంది.

"నేను నిప్పులాంటిదాన్ని కాదు. నిప్పును. మగాళ్ళు ఫోటోలో వుండగా నన్ను తాకినా సరే ఏమైపోతారో ఓసారి ఫోటో కేసి చూడండి—" అంది వకుళ.

మధు తల్లి ఫోటో కేసి చూసి దిగ్భ్రాంతురాలై పోయింది. ఫోటోలో నలుగురూ చిన్నపిల్లలూ నలుగు రాడవాళ్ళు బాగానే వున్నారు. అయిదుగురు మగవాళ్లూ ఉన్నంత మేరా అది కాలిపోయింది. సరిగ్గా అంతే మేర కాలడం ఆవిడకు ఆశ్చర్యంగానే వుంది.

ఆవిడ ఫోటో కేసి — వకుళ కేసీ మార్చి మార్చి చూసింది.

"ఇది చెప్పడానికే వచ్చాను. మరి నేను వస్తాను. మధూ — ఒక్కసారి రోడ్డుదాకా వస్తావా?" అంది వకుళ.

ఆమె నడుస్తూంటే మధు అనుసరించాడు. మధు తల్లికి అడుగు ముందుకు పడలేదు. వెళ్ళిపోతున్న వకుళ వైపూ, తన చేతిలోని కాలిన ఫోటో వంకా ఆవిడ మార్చిమార్చి చూస్తూనే వుంది. ఆవిడ కళ్ళముందు వకుళ ఇంట్లోని గాజుబాడీ, అందులోని బొమ్మా ఒక్కసారి మెదిలాయి. అంతలోనే పుల్లారావు గుర్తొచ్చాడు. వెంటనే ఆ బొమ్మ స్థానంలో వకుళ ఉన్నట్లూ, కేరింతలు కొడుతూ-పైకీ—క్రిందకూ తిరుగుతున్నట్లూ—అనిపించిందావిడకు.

వెంటనే ఆవిడ కెవ్వుమని కేక వేసి కూలబడిపోయింది.

అప్పటికి మధు, వకుళ రోడ్డుమీదకు వచ్చారు. ఇద్దరికీ ఆ కేక వినబడింది.

"అత్తయ్యగారు భయపడినట్లున్నారు-" అంది వకుళ నవ్వుతూ.

"భయపెట్టాలనే కదా నువ్వొచ్చింది!" అన్నాడు మధు.

"అవును. నా శక్తులన్నీ ప్రదర్శించి అందర్నీ హడలగొట్టాలని వుంటోంది. ఈ ప్రపంచాన్నే ఓ ఊపు ఊపాలని వుంటోంది. రోజురోజుకీ ఈ కాంక్ష ప్రబలిపోతోంది. ఈ వీధిలో ఇంకెన్నాళ్ళో వుండలేను. మనం త్వరగా ఇల్లు మార్చాలి. రేపంతా అదే పని నీకు! మంచిల్లు చూడు—" అంది వకుళ.

"ఇంకా చెప్పాల్సిందేమైనా వుందా?"

"వుంది. రక్తం తాగగానే మూతి తుడుచుకోవడం మరిచిపోతే గుర్తు చేస్తూండు. ఇది చెప్పాలనే వచ్చి మీ అమ్మగారితో ఓ ఆట కూడా ఆడి వెళ్తున్నాను. ఇంక వెళ్ళు—" అంది వకుళ.

20

బస్సు దిగగానే జోగారావు భార్యతో—"ధర్మాసుపత్రిమీంచి వెడదామా?" అనడిగాడు.

"అంతా మీ పిచ్చిగానీ ఈ పాటికి వకుళ మనింటికి వెళ్ళిపోయుంటుంది. మనం ముందు ఇంటికే వెడదాం—" అంది శారద.

జోగారావు మాట్లాడలేక ఊరుకున్నాడు. కానీ అతడికి మనసులో దిగులుగా వుంది. రిక్షాలో ఎక్కించినప్పటి కూతురి శరీరం ఎలా సలసల కాగిపోతోందో అతడికి గుర్తుంది. ఆ పరిస్థితుల్లో ఆమెను వదిలేసి వెళి

పోతున్నందుకు తన్ను తనే నిందించుకున్నాడతను.

శారద సామాను లెక్కచూసి— "అన్నీ సరిగ్గానే వున్నాయి. మీరు రిక్షా బేరమాడి తీసుకురండి" అంది.

జోగారావు నాలుగడుగులు వేసి రెండు రిక్షాలు పిల్చుకుని వచ్చి—"మనమెలా కావాలంటే అలా తీసుకు వెడతారుట. ధర్మాసుపత్రి మీదనుంచి తీసుకువెళ్ళినా ఎక్కువ తీసుకోరుట—" అన్నాడు.

శారద భర్త కళ్ళలోకి తీవ్రంగా చూసింది. ఈ పర్యాయం అతడు భయపడలేదు. అతడి కళ్ళలోని అరింపును ఆమె గుర్తించింది.

ఇటీవల భర్త కూతురి గురించి కలవరపడుతున్నాడని ఆమె గ్రహించింది. అత్తారింట్లో వదినగారి కొడుకు బారసాలకు వచ్చినా అతడు ప్రతిరోజూ అన్యమనస్కంగానే వున్నాడు. ఎన్నడూ లేనిది అల్లుడలాగుండడం చూసి అత్తమామలు అడిగారు కూడా. అయితే శారద తలిదండ్రులకు వకుళ జబ్బు గురించి చెప్పలేదు.

"సరేలెండి—ఆసుపత్రిమీంచే వెడదాం. మీ వెర్రి గానీ అదింకా అక్కడెందుకుంటుంది? అప్పుడే దాన్ని దిగవిడిచి వారంకావస్తోంది—" అంది శారద.

'వళ్ళెరుగని జ్వరంలో వున్న పిల్లని వదిలేసి వారం రోజులున్నానన్నమాట—' అనుకున్నాడు జోగారావు. జ్వరమెప్పుడు తగ్గిందో, పథ్యమెవరు పెట్టారో—అదిప్పుడసలెలాగుందో?

భర్త మాట్లాడకపోవడం చూసి శారదే మళ్ళీ అంది— "మా బావకీ ఊరు ట్రాన్స్‌ఫరయింది. మనిల్లు పెద్దదే కదా అని వాళ్ళని మనింటికొచ్చి వుండమన్నాను. ఎందు

కనుకున్నారు? వకుళ ఆరోగ్యం కుదుటపడి వుంటుందన్న నమ్మకం నాకుండబట్టే!—ఎంత సవతి తల్లినైనా పెంచిన ప్రేమకదా? మూడేళ్ళప్పట్నించీ పెంచాను దాన్ని. ఏదో మామూలు జ్వరం కదా అని వదిలేశానుగానీ...." అని ఆగిపోయి — "మీరలా అన్యమనస్కంగా ఉంటే కాదు—ఇంటికి వెళ్ళగానే కాస్త మా వాళ్ళకి ఏర్పాటు చెయ్యాలి. నాల్రోజుల్లో వాళ్ళు వచ్చేస్తారు—" అంది మళ్ళీ.

అంతా రిక్షాలు ఎక్కారు. ధర్మాసుపత్రి దగ్గర శారదే దిగి లోపలకు వెళ్ళి కనుక్కుంది. అయితే అక్కడ వకుళ లేదు. ఎవ్వరూ ఆమెకు సరైన సమాచారం అందివ్వలేకపోయారు. ఒక డాక్టర్ని నిలదీసి అడిగితే—"చూడమ్మా — ఇక్కడికి జనం వందల్లో వస్తారు. ఎంతమందినని మేము కాచుకుంటాం. రోగిమీద మీకు శ్రద్ధ ఉంటే కూడా మీలో ఎవరో ఒకరొచ్చి వుండాలిగానీ — ఇలా మా మీద సవారీచేస్తే లాభం లేదు—" అన్నాడు. ఆ మాటలకు కిక్కురుమనకుండా శారద బైటకు వచ్చేసింది.

జోగారావు ఆత్రుతగా భార్యవంకే చూస్తున్నాడు. అది గమనించిన శారద—"నేను చెప్పలేదండీ—అనుకున్నట్లే అయింది. మర్నాడే దాన్నింటికి పంపించేశారుట. అంత చిన్న జ్వరాని కింత హడావుడేమిటని ఒకటే నవ్వు కూడాను—" అని తనూ నవ్వడానికి ప్రయత్నించింది. అయితే ఆమెకు కూడా నవ్వు రాలేదు.

ఆ రోజు వకుళకు జ్వరం తీవ్రంగానే వచ్చింది. ఆమెను డాక్టర్లు శ్రద్ధగా చూశారా? జ్వరం తగ్గిందా? ఇప్పుడు వకుళ ఎక్కడుంది?

ఒకవేళ వకుళ....

"అబ్బే అలా జరగదు—" అనుకుంది శారద. ఆ ఆలోచనకే ఆమెకు చెమట్లు పట్టాయి. "దానిది మొండి ప్రాణం. అంత సులభంగా చావదది....కానీ.... కానీ...." శారదకు బెంగగా వుంది—"వకుళ యింట్లో ఉందా? యిప్పుడింటికి వెళ్ళేసరికి ల్లు తాళం వేసి వుంటుందా-తీసి వుంటుందా?"

రిక్షాలు ఇల్లు చేరాయి. ఇంటికి తాళం వేసే వుంది. శారద గుండె గుభేలుమంది.

జోగారావు శారదవంక చూశాడు. అతడి ముఖంలో కోపంలేదు. కళ్ళలో బెంగ వుంది. కానీ శారద తలెత్తి అతడివంక చూడలేదు. తప్పు చేశానన్న అనుభూతి ఆమెలో క్షణమాత్రం కలిగింది.

శారద ముందు ఇంట్లో అడుగుపెట్టకుండా ఎదురింటి కామేశ్వరమ్మ తలుపు తట్టింది.

పుల్లారావొచ్చి తలుపు తీసి—"మీరా? యెప్పుడొచ్చారు?" అన్నాడు.

"ఇప్పుడే—మీ అమ్మ ఉందా—మీ యింట్లో తాళమిచ్చాను. వెళ్ళి అడిగి తీసుకురా...." అంది శారద. వకుళ గురించి అడిగి తెలుసుకోవాలని నాలిక చివరిదాకా వచ్చి ఆగిపోయింది. అసలు వకుళని యెక్కడ, యెందుకు వదిలేసి వెళ్ళారూ అనడిగితే ఏం చెప్పాలి?

కామేశ్వరమ్మ తాళంచెవి తీసుకువచ్చి—"ఇదేనాన్మా రావడం—" అనడిగింది.

తాళంచెవిని చూస్తూనే శారద గుండె మళ్ళీ గుభేలుమంది. అంటే తాళంకోసం వకుళ వీళ్ళదగ్గరకు రాలేదన్న మాట. ఇంక వుండబట్టలేక—"మా వకుళ తాళంకోసం

రాలేదా?" అనడిగింది.

"తాళం మా కిచ్చినట్లు తెలియక తను తాళం బద్దలు కొట్టుకుని యింట్లో కెళ్ళిందట. ఇప్పుడు యింట్లో కొత్త తాళం వేసింది. తను బయటకు వెడుతూ ఓ చెవి మా కిచ్చి వెళ్ళిపోయింది—మీ రొస్తే ఉంటుందని!" అంటూ తాళం చెవి శారద కిచ్చిందామె.

"అంటే—అని తాళం బద్దలు కొట్టేంత ఘటికురాలెందన్నమాట. కాస్త యెదురింట్లో అడిగి చూస్తే ఏమయింది? అయినా దానికి డబ్బు విలువ ఎప్పుడు తెలిసేడ్చింది కనుక....ఇలా తాళం బద్దలుకొట్టి అలా కొత్తది కొంది. ధరలు మండిపోతున్న యీ రోజుల్లో యిదేనా చేయాల్సింది? రానీ చెబుతాను. అయినా ఈ టైములో దీనికి పెత్తనాలు కావలసొచ్చాయా? రోజూ యిలాగే బైటకు పోతోందా?" అనడిగింది శారద. వకుళ ఇంటికి వచ్చింది అని తెలియగానే ఆమె మనసు తేలికపడింది. పాత ప్రవృత్తి మళ్ళీ బుసకొట్టింది.

"ఏమోనమ్మా—నాకు మా యింట్లో పనులతో నే సరిపోతోంది. రోజూ వెడుతోందో లేదో తెలియదు. అది సరే—మీ రూరికి వెళ్ళేటప్పుడు వకుళ యింట్లో లేదు గదా—అప్పుడు తను పెత్తనాలకు వెళ్ళిందా—నువ్వెక్కడికయినా పంపావా?" అనడిగింది కామేశ్వరమ్మ.

తెలుసుకోవాలని అడిగిందో, వెటకారం చేస్తోందో అర్థంకాలేదు శారదకు. అయితే ఆ ప్రశ్నకు జవాబేం చెప్పాలో తెలియక—"అన్నీ తర్వాత మాట్లాడుకుందాంలే—" అని శారద అక్కణ్నించి వచ్చేసింది.

శారద వెళ్ళిపోతూంటే కామేశ్వరమ్మ కుతూ

పాలంగా చూస్తోంది. ఇప్పుడేం జరుగుతుంది?....ఆమె తలుపులు పూర్తిగా వేయకుండా యెదురింటివైపే చూడసాగింది.

శారద విసురుగా భర్తను చూసి—"చూశారా—మీ అమ్మాయి వరస! తాళం బద్దలు కొట్టి ఇంట్లో దూరిందట. డబ్బు తగలేసి కొత్తతాళం కొని ఇంటికేసి పెత్తనాలకు పోయిందిట—" అంది.

జోగారావు మనసు ఆ మాటలకు తేలికపడింది. అత నే మాత్రమూ కలవరపడకుండా—"పోనీ తాళం ఎదురింట్లో ఇచ్చిందా, లేదా?" అనడిగాడు.

"ఏదో—ఆ మాత్రం చేసింది లెండి—" అంది శారద మూతి మూడు వంకర్లు తిప్పి. భర్త కూడా తనతో పాటు వకుళ చర్యను గర్హించకపోవడం ఆమెకు నచ్చ లేదు.

శారద తాళం తీసింది. హాల్లో దీపం వేసింది.... "అబ్బబ్బ....ఇది మనుషులుండే కొంపలాగుందా?" అంటూ విసుక్కుంది.

రిక్షావాళ్ళు సామాను లోపలపెట్టి డబ్బులు తీసుకుని వెళ్ళిపోయారు.

"ఒక్క నిముషం నడ్డి వాలుస్తాను....అలసటగా వుంది. వెధవ బస్సులో కూర్చుని నడ్డి లాగేసింది—" అంటూ జోగారావు పడకగదిలోకి వెళ్ళాడు.

"మాకూ అలసటగా ఉంది—" అంటూ పిల్లలిద్దరూ కూడా పడగ్గదిలోకి నడిచారు.

"ఏ అలసటా లేనిదాన్ని ఈ ఇంట్లో నే నొకత్తినే!" అని గట్టిగా అరిచింది శారద.

"ఈ యింటికి యజమానురాలిని. అలసటగా ఉంటే

విశ్రాంతి తీసుకోవడానికి ఎవరి అనుమతీ అక్కర్లేనిదానివి నువ్వే కదా—" అంటూ పడకగదిలోంచి జోగారావు శాంతంగా జవాబిచ్చాడు.

ఆ సమాధానం శారదకు నచ్చలేదు. ఆమె కోపాన్ని వీధి తలుపులు వేయడంలో చూపించింది. భ దేలుమని తలుపులూ, దడీమని గడియ వేసింది.

అంతవరకూ తలుపు సందుల నుంచి చూస్తూన్న రామేశ్వరమ్మ నిరాశగా—"ఇంతవరకూ ఏం జరగలేదు?" అనుకొని తనూ తలుపు వేసుకొంది.

శారద చిరాగ్గా—"అసలోసారి ఇల్లంతా ఎలా ఉందో చూడాలి—" అనుకుంటూ వకుళ ఉండే గది లోనికి వెళ్ళింది. దీపం వేయగానే గదిలో కనపడ్డ వస్తువులామెకు దిగ్భ్రమ కలిగించాయి. అందులో ఒక్కటీ ఇదివరలో ఉన్నవి లేవు. గదిలో మూలగా ఉన్న నిలువెత్తు గాజుజాడీ ఆమెకు ఆశ్చర్యాన్ని కలిగించింది.

"ఇవన్నీ ఏమిటో?" అనుకుంది శారద. అప్పుడే ఎవరో నవ్వినట్లు వినపడిందామెకు. శారద అప్రయత్నంగా తలెత్తి చూసింది. అంతే—కెవ్వుమని ఇల్లదిరిపోయేలా కేకపెట్టి పరుగు పరుగున భర్త వున్న గదిలోకి పరుగెత్తింది శారద.

"ఏం జరిగింది?" అంటూ లేచి కూర్చున్నాడు జోగారావు. పిల్లలు కూడా ఎంతో కంగారుపడిపోయారు.

శారద నిలబడి ఆయాసంతో రొప్పుతోంది. ఆమె కళ్ళు భయంవల్లనో మరెందువల్లనో గుండ్రంగా తిరిగి పోతున్నాయి. ఆమె చటుక్కున కూలబడిపోయింది.

"ఏం జరిగిందే?" జోగారావు అడిగాడు.

"గదిలో.... దెయ్యం...." అంది శారద అతి కష్టం

మీద గొంతు పెగల్చి.

దెయ్యం అన్న మాట వింటుంటే పిల్లలిద్దరూ కూడా కవ్వమని భయంతో వణకడం మొదలెట్టారు.

"దెయ్య మేమిటే....?" అన్నాడు జోగారావు విసుగ్గా.

"గదిలో....వకుళ ...దెయ్యం!...." అంది శారద మళ్ళీ.

"ఏదీ ...నాకు చూపించు...." అంటూ లేచి నిలబడ్డాడు జోగారావు. వకుళ ....దెయ్యం అనగానే అతడి మనసు కీడును శంకించింది. వకుళేమిటి—దెయ్యమేమిటి—అని గొణుక్కున్నాడు.

"మీరు వెళ్ళి దాని గదిలో చూసి రండి—" అంది శారద.

"నువ్వూ రా—నేను పక్కనుంటాను గదా—నీ కే భయం లేదు.....…" అన్నాడు జోగారావు.

"అమ్మ బాబోయ్—ఆ దృశ్యం మళ్ళీ చూడలేను నేను...." అంది శారద.

జోగారావుకు చిరాకేసింది—"అసలేమిటో చెప్పు ముందు...."

శారద గొంతు సవరించుకొని పిల్లలకేసి చూసి—"ఒరేయ్—మీరు వినకండి. అలా వెళ్ళండి—" అంది. కానీ పిల్లలు కదల్లేదు. వాళ్ళ కళ్ళలో భయం, కుతూహలం—రెండూ కనబడుతున్నాయి.

శారద లేచి భర్తకు దగ్గరగా వచ్చి—స్వరం కాస్త తగ్గించి—"గదిలో పైకప్పుకు బల్లిలా అంటిపెట్టుకొని వున్నది. దాని ముఖం నా వైపే తిరిగి వున్నది. దాని వంటిమీద బట్టలు లేవు. అది నవ్వుతోంది. ఎప్పుడైనా

ఎవరైనా అలాంటి దృశ్యం ఊహించగలరా?" అంది.

జోగారావు ముఖంలో భయం కంటె దిగులు కన పడింది.—"అయితే అది వకుళే నంటావా?" అన్నాడు.

"చిన్నప్పట్నించి పెంచాను. వకుళ నాకు తెలి యదా?"

"అయితే అది చచ్చిపోయి దెయ్య మయిందం టావా?...."

శారద ఉలిక్కిపడి—"అవును—నాకీ విషయం స్ఫురించనేలేదు. పైన కనబడ్డ దృశ్యం నా మతి పోగొట్టింది. అది తాళంచెవి కామేశ్వరమ్మకిచ్చి వెళ్ళింది. మరి యింట్లో...." అని ఆగింది.

"పద—వెళ్ళి చూద్దాం—" అన్నాడు జోగారావు.

శారద తను రానంటె రానన్నది. జోగారావు తా నొక్కడే గదిలోకి వెళ్ళాడు. గదిలోని వింత వస్తువు లతడికి ఆశ్చర్యాన్ని కలిగించాయి. కానీ అక్కడ భయం కరమైనదేదీ అతడి క్కనిపించలేదు. అత డక్కణ్నించే పిల్లలిద్దర్నీ కేక పెట్టాడు—"రమా—సూర్యం—ఇలా రండి—మీ అమ్మ ఇక్కడ ఏం చూసి భయపడిందో తెలుసుకుందురు గాని...."

అతడి పిలుపు వింటూనే పిల్లలిద్దరూ పరుగున వచ్చారు. తర్వాత అక్కడేమీ లేకపోవడం చూసి ముగ్గురూ పక పకా నవ్వసాగారు. జోగారావు నవ్వాపి—"దెయ్యాలు పిరికివాళ్ళకోసం కాచుకూర్చు నుంటాయ్. మనవంటి ధైర్యవంతులకోసం కాదు. వెళ్ళి మీ అమ్మను కూడా తీసుకొని రండి—" అన్నాడు.

"అయితే పిల్లలు కదలేదు. వాళ్ళు ఇంకా నవ్వ సాగారు. వాళ్ళ నవ్వు చూసి జోగారావు మళ్ళీ తనూ

శృతి కలిపాడు. అయితే వాళ్ల నవ్వులు ఒక్కసారిగా ఆగిపోయాయి.

ఆ ముగ్గురి నవ్వులతోనూ మరొకరి నవ్వు కలిసింది. ఆ నవ్వు మరో రకంగా వున్నది. వీరి నవ్వులతో శృతి కలవ లేదు. నెమ్మదిగా, భయంకరంగా ఉన్న ఆ నవ్వు ముగ్గురూ కూడా స్పష్టంగా విన్నారు.

వాళ్ళు నవ్వాపగానే ఆ నవ్వు కూడా ఆగిపోయింది.

జోగారావు సూర్యంకేసి చూసి—"వెటకారంగా వుందా వెధవకానా—మామూలుగా నవ్వక అదేం నవ్వు? అసలే మీ అమ్మ భయపడి చస్తోంది. ఇలా నవ్వావంటే దాని గుండె ఆగిపోతుంది కూడా—" అన్నాడు.

"నేను నవ్వలేదు నాన్నా—ఇంకా నువ్వలా నవ్వుతున్నావేమో ననుకున్నాను—" అన్నాడు సూర్యం దిక్కు మొగంవేసి.

ఇద్దరూ అనుమానంగా రమవంక చూశారు. రమ తన కేమీ తెలియదంది.

"మనం ముగ్గురం కాకపోతే దెయ్యం నవ్విందం టారా?" అన్నాడు జోగారావు విసురుగా. అతడా ప్రశ్న వేయగానే పిల్లలిద్దరూ బెదిరిపోయారు. అమ్మ దెయ్యాన్ని చూశానంది. తమకు దెయ్యం కనబడలేదు కానీ యేదో నవ్వు వినబడింది. అది దెయ్యానిదా? ఈ యింట్లో దెయ్యం చేరిందా?

"సరే ఈ విషయం అమ్మకు చెప్పకండి. సూర్యం—నువ్వెళ్ళి అమ్మను పిల్చుకురా—దానెదురుగుండానే ఈ గదిలో అణువణువూ శోధిద్దాం. అందరి అనుమానాలూ వదిలిపోతాయి—" అన్నాడు జోగారావు.

సూర్యం గదిలోంచి హాల్లోకి అడుగుపెట్టి—నాలు

గడుగులు వేసి—ఇంక అడుగు ముందుకు పడక ఆగి పోయాడు.

వీధి తలుపు గడియ నెమ్మదిగా దానంతటదే తేస్తోంది. చూస్తూంటే యెవరో అదృశ్య వ్యక్తి గడియ తీస్తున్నట్లుంది.

సూర్యం అరుద్దామనుకున్నాడు. గొంతు లేవలేదు. పరుగెడదామనుకొన్నాడు. అడుగుపడలేదు. కళ్ళు మాత్రం తలుపువైపే చూస్తున్నాయి.

గడియ విడింది. తలుపులు తెరుచుకొన్నాయి—నెమ్మదిగా!

సూర్యం ఊపిరి బిగబెట్టాడు.

లోపల వకుళ అడుగుపెట్టింది.

సూర్యం వకుళను గుర్తుపట్టి ఒక్క పరుగున ఆమెను చేరి—"అక్కా—నువ్వా?" అన్నాడు.

"ఎప్పుడొచ్చావురా?" అంది వకుళ—వాణ్ని దగ్గరగా తీసుకొని.

"అబ్బా—నీ వళ్ళు చాలా చల్లగా వుంది—"అన్నాడు సూర్యం.

"ఈ ఊళ్ళో ఓ హోటల్లో స్కేటింగ్ కి కృత్రిమ మంచు తయారుచేశారు. అక్కణ్నించే వస్తున్నాను. రేపు నిన్ను అక్కడికి తీసుకువెడతాన్లే—అంతా కులాసానా?" అంది వకుళ.

"నువ్వు లోపలకు వచ్చేటప్పుడు గడియ దానంతటదే విడింది. నేను హడలిపోయాను. ఏ దెయ్యమైనా వస్తోందేమోనని. కానీ తీరా చూస్తే నువ్వే వచ్చావు—" అన్నాడు సూర్యం.

"అదా?" అని చటుక్కున నవ్వింది వకుళ. అదే

నవ్వు. నెమ్మదిగా, భయంకరంగా!

సూర్యం ఉలిక్కిపడి—"అదే నవ్వు — ఇందాక, గదిలో....విన్నాను...." అన్నాడు.

వకుళ నవ్వాపేసి "గడియ బయటనుంచి ఎలా తెరుచుకుంటుందీ చూపిస్తానుదా—" అని సూర్యాన్ని వీధిలోకి తీసుక వెళ్ళింది. గడియ మేకు ఒకటి బయట కు పొడుచుకుని వచ్చింది. దాన్ని బైటనుంచి తిప్పి గడియ తీసేయవచ్చు. సూర్యం తను కూడా అలాగే చేసి ఆనంద పడ్డాడు.

ఈలోగా — "ఎవర్రా వస్త—" అంటూ శారద, జోగారావు, రమ వచ్చారు హాల్లోకి.

వకుళ చకచకా వాళ్ళను సమీపించి—"బారసాల బాగా జరిగిందా పిన్నీ—" అనడిగింది.

శారద వకుళను ఎగాదిగా చూసి-"నువ్వు కులాసాగా ఉన్నావా?" అంది.

జోగారావు కళ్ళు కూతుర్ని చూడగానే తృప్తితో మెరిశాయి. వకుళ ఆ తృప్తిని గమనించింది. ఆమె తండ్రి నింకేం అడగలేదు. ఈలోగా సూర్యం తలుపు గడియ గురించి వర్ణించి చెప్పాడు.

వెంటనే శారద గుండెలు బాదుకుని—"ఇలా బైట నుంచే తీసేమాటయితే ఈ యింటి వీధి గుమ్మానికి గడి యెందుకు? అయ్యో అయ్యో—ఈ ఇల్లు గుల్లయిపోతుంది. వెంటనే బాగుచేయించాలి. అయినా ఇంట్లో వాళ్ళే తలుపలా తీస్తుంటే—బయట్నించెవరైనా చూశారంటే ఇంకేమైనా వుందా?" అంది.

"ఎందుకలా గుండెలు బాదుకుంటావు పిన్నీ—తలుపు గడియ బయట్నించి తియ్యడం ఎవరివల్లా కాదు. నాకు

సూర్యమే తలుపు తీశాడు. నన్ను భయపెట్టాలని ఏదో కథ చెప్పాడు—" అంది వకుళ.

"లేదమ్మా—నాకు అక్క చూపించింది. నేను కూడా బయటినుంచి తలుపు గడియ తీయగలిగాను—" అన్నాడు సూర్యం.

"దీనికింత గొడవెందుకు—వెళ్ళి చూస్తే సరిపోలా?" అన్నాడు జోగారావు.

అంతా వెళ్ళి చూశారు. వీధి తలుపు ఎప్పటిలా మామూలుగా వుంది. గడియ మేకేదో పొడుచుకు వచ్చినట్లు లేదు. సూర్యం కళ్ళు తేలవేశాడు.

"వచ్చీరాగానే నన్ను తిట్టించాలని వెధవ బుద్ధి— పిన్నీ నీ బుద్ధిలే— నీ పిల్లలకూ వంటబట్టేస్తున్నాయ్. నేను మిమ్మల్ని పలకరించడమే తప్పు. నా గదిలోకి పోతాను—" అంటూ విసురుగా ఆ గదిలోకి వెళ్ళి పోయింది వకుళ.

వకుళ ధైర్యానికి జోగారావు విస్తుపోయాడు. శారద మాత్రం ఈ ఎదిరింపు సహించలేకపోయింది. "ఇప్పుడే ఊర్నుంచి వచ్చాం — మాకంతా వంట చేసి పెట్టవా?" అంటూ అక్కణ్నుంచి అరిచింది.

"నేనూ తిరిగి తిరిగి వచ్చాను. వంట చేయలేను. నా కన్నం అక్కర్లేదు. మీకాక్కావాలంటే మీరు వండుకు తినండి. నా జోలికి రావద్దు—" గదిలోంచి సమాధానం ఇచ్చింది వకుళ. ఆమె తలుపులు దగ్గరగా మూసింది.

ఈ గొడవలో తనకేమీ సంబంధం లేనట్లుగా జోగారావు వీధి తలుపు గడియవేసి — పిల్లలిద్దర్నీ తీసుకుని పడగ్గదిలోకి వెళ్ళిపోయాడు.

"ఎలా చేయవో చూస్తాను—...." అంటూ శారద

విసురుగా వకుళ గది దగ్గరకు వెళ్ళి తలుపు తీసి ఏదో అనబోయి మాట్లాడ్డానికి బదులు కెవ్వుమని కేక వేసింది.

ఎదురుగా గాజు జాడీలో వకుళ నగ్నంగా జలకా లాడుతోంది. ఆ దృశ్యం చూడ్డానికి భయంకరంగా వున్నది. వకుళ నాలిక బైటపెట్టి శారదను వెక్కిరించింది.

శారద మళ్ళీ వెనక్కి పరుగెత్తి పడకగది చేరి జోగారావుతో—"సందేహంలేదు. ఆ గదిలో పిశాచ ముంది. ఆ పిశాచాన్ని వకుళ స్వాధీనం చేసుకుంది—" అంది.

"ఏమయిందే?" అన్నాడు జోగారావు కొంచెం విసుగ్గా.

శారద మంచంమీద పడుకుని ఇంకా రొప్పుతూనే తను చూసిన దృశ్యాన్ని నెమ్మదిగా భర్తకు వర్ణించి చెప్పింది. ఆమె చెప్పడం పూర్తికాగానే గుమ్మంవంక చూసి చటుక్కున ఆగిపోయింది.

అక్కడ వకుళ నిలబడి వుంది. ఆమె కళ్ళు అదో రకమైన, మానవాతీతమైన క్రూరత్వంతో శారదవంక నే చూస్తున్నాయి.

"ఏం ఆగిపోయావ్ పిన్నీ!" అంది వకుళ.

జోగారావు వెనక్కి తిరిగి—"నువ్వా?" అన్నాడు ఆశ్చర్యంగా. భార్య చెప్పినవిధంగా స్నానంచేసిన చిహ్నాలేమీ వకుళలో గోచరించడంలేదు. ఆమె ఇందాక ధరించిన బట్టల్లోనే వున్నది. అవి పొడిగానూ వున్నవి.

"నేనే నాన్నా! మీరు నన్ను నిర్దాక్షిణ్యంగా ధర్మాసుపత్రిలో వదిలేసిపోయారు. అంతా ఉండీ కూడా నన్ననాథను చేశారు. ఎలాగో ఈ రూపంలో నేను మీ

ఎదురుగా నిలబడ్డాను. కానీ నా వళ్ళంతా పగతో రగిలిపోతోంది. అందుకే రాగానే పిన్నిని భయపెట్టాను. భయపెట్టడం కోసమే ఓ బొమ్మను కొని గదిలో వుంచాను. పిన్ని నీళ్ళలో చూసింది బొమ్మను! నేనిప్పుడు మునుపటి వకుళను కాను! నేనెవ్వరికి భయపడను. నన్ను బాధించేవారి గుండెలదరగొడతాను. నా జోలికి వచ్చే ముందు ఇవన్నీ ఆలోచించుకోండి—" అంది వకుళ.

"ఏమిటమ్మా ఆ పిచ్చి మాటలు—" అన్నాడు జోగారావు.

"పుట్టెడు జబ్బుతో నన్ను వదిలేసిపోయారు. వారం కాకుండా తిరిగొచ్చి నేను వండిపెడతాననుకుంటున్నారు. పిచ్చి మాటలు నావా, మీవా?" అంది వకుళ.

జోగారావు హోటలుకు వెళ్ళి అందరికీ క్యారేజీ భోజనం తీసుకు వచ్చాడు.

వకుళ తను భోజనం చేయనన్నది. ఎవరెంత బలవంత పెట్టినా ఒప్పుకోలేదు.

శారదా వాళ్ళూ భోంచేస్తూండగా ఎవరో తలుపు తట్టారు. వకుళ వెళ్ళింది తలుపు తీయడానికి.

మధు వచ్చి రక్తం సీసా ఆమె చేతికిచ్చాడు. ఒక్క గుక్కలో రక్తం తాగేసిందామె. మధును వెళ్ళి పొమ్మనమని చెప్పి లోపలకు వెళ్ళబోతూంటే—"వకుళా మూతి తుడుచుకో!" అన్నాడు మధు. వకుళ చటుక్కున మూతి తుడుచుకుని తలుపు వేసి లోపలకు వెళ్ళింది.

"ఎవరే వస్తి?" అనడిగింది శారద.

"మధు!"

"ఎందుకు?"

"నాకోసం?"

"నీ కోసమే-ఎందుకు వచ్చాడూ అనడుగుతున్నాను."

"నా కోసం కాకపోతే నీ కోసం వస్తాడను కున్నావా?" అంది వకుళ.

"వకుళా — పెద్దా చిన్నా లేకుండా ఏమిటా మాటలు?" అన్నాడు జోగారావు.

శారద ఆశ్చర్యంగా వకుళ వైపు చూస్తోంది. ఏమిటి దాని ధైర్యం? పిల్లిలా పడుండే మనిషి ఇంతలా ఎదురు సమాధానాలెలా చెప్పగల్గుతోంది?

భోజనాలవగానే జోగారావు, పిల్లలు వెళ్ళి పడు కున్నారు. శారద వకుళను ఎంగిళ్ళు తియ్యమన్నది.

"నేను తియ్యను—నాకూ నిద్రవస్తోంది-"అంది వకుళ.

"ఎవరికోసం తీస్తావే"—అంటూ శారద వకుళ చేయి పట్టుకుని లాగి గుంజబోయి—అప్రయత్నంగా పట్టు వదిలే సింది. ఆ చేయి మంచుకన్న చల్లగా వుంది.

"చెయ్యి చల్లగా వుందా? మరిందాకా మధు వచ్చాడుగా—వెచ్చదనమంతా తనే తీసుకుపోయాడు—" అని ఫక్కున నవ్వింది వకుళ.

ఆ నవ్వు....అదే నవ్వు....ఇందాకా... ఇంటి కప్పు కతుక్కుని....నగ్నంగా....వకుళ నవ్విన నవ్వు....అదే నవ్వు....ఆ నవ్వు....

"అదేం నవ్వు?" అంది శారద భయంగా.

"నీ కోసం ప్రత్యేకంగా ప్రాక్టీసు చేస్తున్నాను—" అంది వకుళ.

"తల్లీ—ముందు నువ్విక్కణ్ణుంచి వెళ్ళు—" అంది శారద.

"ఆ మాటకోసమే ఎదురు చూస్తున్నాను...." అంటూ క్షణాలమీద తన గదిలోకి వెళ్ళి తలుపులు వేసు

కుంది వకుళ.

శారద ఎంగిళ్ళ తుకుని తలుపులు వేసుకుంది. కానీ ఇంట్లో ఎక్కడా లైట్లార్పలేదు. ఆమెకిప్పుడు చాలా భయంగా వుంది. మళ్ళీ ఓసారి వకుళ గదిలోకి వెళ్ళి తిట్టివద్దామనుకున్నది. గది గుమ్మందాకా వెళ్ళి ధైర్యం చాలక వెనక్కి వచ్చేసింది..

ఆమె పడక గదిలోకి వెళ్ళేసరికి భర్త, పిల్లలు— అంతా నిద్రపోతున్నారు.

అప్పుడు శారదకు హఠాత్తుగా ఆ యింట్లో మెలకువగా వున్నది తనొక్కర్తేనని గుర్తొచ్చింది. అంతులేని భయం ఆమెను ఆవహించింది.

సాధారణంగా పిల్లలు వేరే గదిలో పడుకుంటారు. భయపడ్డారో ఏమో వాళ్ళా ఆ గదిలోనే పడు కున్నారు. వాళ్ళ కోసం జోగారావు గదిలో రెండు మడత మంచాలు వేశాడు.

శారద వెళ్ళి భర్తను లేపింది.

"ఏమిటే?" అనడిగాడు జోగారావు కళ్ళు నులుము కుంటూ.

"అప్పుడే అంత నిద్రేమిటండీ—" అంది శారద.

"నిద్రపోకుండా ఏం చేయాలో చెప్పు—" అన్నాడు జోగారావు.

"నాకు భయం వేస్తోందండీ — అందుకే ఇంట్లో ఎక్కడా దీపాలార్పలేదు. మీరు వెళ్ళి అన్నీ ఆఫ్ చేసి రండీ—"

జోగారావు మాట్లాడకుండా లేచి వెళ్ళాడు. ఎప్పుడో తప్ప భార్య మాటలకు విసుక్కోవడం అతడి కలవాటు లేదు.

శారద కళ్ళు తెరవలేదు. భర్త వెళ్ళగానే కళ్ళు మూసింది.

"పిన్నీ!" అంటూ ఎవరో చెవి దగ్గర గుసగుసలాడి నట్లయింది. ఆ పిలుపు శారదకు స్పష్టంగా వినబడింది. కానీ ఆమె కళ్ళు తెరవలేదు. పిలుపు మళ్ళీ వినబడింది. అయినా ఆమె కళ్ళు తెరవలేదు.

అప్పుడామెను ఎవరో కుదిపారు. "పిన్నీ!" అన్న గుసగుసలాంటి పిలుపు ఆమెకు మళ్ళీ వినబడింది. అయితే తన్ను కుదిపినవారి స్పర్శ—మంచుకన్న చల్లగా వుంది!

చటుక్కున శారద కళ్ళు విప్పింది.

ఎవ్వరూ లేరు—ఆమె అటూ యిటూ చూసింది. ఎవ్వరూ లేరు.

ఇంతలో దూరంగా అడుగుల చప్పుడు వినపడింది.

శారద ఊపిరి బిగబట్టింది.

అడుగుల చప్పుడు క్రమంగా దగ్గరయింది.

శారదకు శ్వాస ఆగిపోయినట్లే అయింది.

చీకట్లో ఒక ఆకారం గదిముందు అడుగుపెట్టింది

కెవ్వుమని అరిచింది శారద.

గదిలోని పిల్లలిద్దరూ కూడా చటుక్కున లేచి కూర్చుని గుమ్మంకేసి చూసి కెవ్వుమని అరిచారు.

"ఏమయిందే?" అడిగాడు గుమ్మంలోని జోగారావు ఆశ్చర్యంగా.

"మీరా?" అంది శారద తేరుకుని.

"బాగుంది. హఠాత్తుగా నీలో భయం పుట్టుకుంది. ఆఖరికి నన్ను కూడా దెయ్యమనేటట్టున్నావ్?" అని—

"మీరు పడుకోండి. రాత్రి తెల్లవార్లూ కవ్వుమన్న కేకలు వినపడ్డా మీరు లేవకండి. మీ అమ్మ చిన్న పిల్లలకంటే ఘోరంగా తయారయింది—" అన్నాడు పిల్లలతో జోగారావు.

అతను గదిలో లైటు ఆర్పబోతే—"వద్దండీ—అది వుంచండి—" అంది శారద.

"సరే—నీ యిష్టం—నేనూ ఓ మడత మంచం తెచ్చు తెచ్చుకుంటాన్లే—" అన్నాడు జోగారావు.

గదిలో పిల్లలు కూడా పడుకొన్నారు. అందువల్ల లైటుంటే భర్త తన మంచంమీద పడుకోడు. ఈ రోజు తన కెంత భయంగా వుందంటే ఒక్కర్తీ పడుకుంటే గుండె ఆగిపోవచ్చు.

"వద్దు లెండి. దీపం ఆర్పేయండి—" అన్నది శారద.

జోగారావు డబల్ కాట్ మీద భార్య పక్కన చోటు చేసుకొన్నాడు.

శారద భర్తను నిద్రపోనివ్వలేదు. పిల్లలు నిద్రపోయా రని రూఢి అయ్యేవరకూ ఆమె ఆ కబురూ ఈ కబురూ చెప్పి—తర్వాత—"ఏమండీ వకుళ గురించి మీ కే అను మానమూ లేమూ?" అంది.

జోగారావు గొంతు సరించుకొని "నీ మాట నేను వినడమే కానీ నా మాట నువ్వెప్పుడూ వినలేదు. వింటా నంటే ఒక్క మాట చెబుతాను—" అన్నాడు.

"చెప్పండి—" అంది శారద నీరసంగా.

"నీ మనసు చాలా మంచిది. ఆ సంగతి నీకే తెలియ దని నా అనుమానం. నీకు వకుళమీద ప్రేమానురాగా లున్నాయి. అది మొండిది కావడంవల్ల నువ్వు దానిపట్ల కఠినంగా వ్యవహరించావు తప్పితే పెంచిన ప్రేమ ఏమై

పోతుంది? అయినా చివర్లో బారసాలకు బయల్దేరినప్పుడు నువ్వు వకుళను ధర్మాసుపత్రిలో వదిలేశావు. ఆ క్షణంలో ఏ పిశాచం నిన్నావహించిందో కానీ—అది నీ సహజ ప్రవర్తనకు భిన్నంగా ప్రవర్తింపజేసింది. అందువల్ల నీ మనసు బాధపడుతోంది.

వకుళకు నీ కారణంగా దారుణమైన నిర్లక్ష్యం జరిగిందనీ—దాని ప్రాణాలు పోతే ఆ బాధ్యత నీదేననీ నీకు అనిపించింది. అది ప్రాణాలతో బ్రతికివుండదనీ పిశాచమై నిన్ను పట్టి పీడిస్తుందనీ ఏ మూలో నీలో బెదురుంది. అందుకే—రాగానే ఈ యింట్లో నీకు యెటు చూసినా పిశాచమే కనబడుతోంది. నిజానికి అదంతా నీ భ్రమ. దెయ్యాలే వుంటే యింట్లో అందరికీ కనిపించేవి. కాస్త మనసు కుదటపర్చుకో. ధైర్యం వహించు. దెయ్యం గియ్యం యేమీ వుండదు."

భర్త మాటలు శారదకు కొంత ఉపశాంతిని కలిగించాయి. "అంతేనంటారా, అంతా నా భ్రమే నంటారా? ఈ భ్రమంతా పోవడానికి ఏం చేయాలంటారు?"

"నాలుగురోజులు వకుళను ఏమీ అనకు. అది పెంకిగా వున్నా సహించు. అప్పటికి నీ మనసు కుదుటపడుతుంది" అన్నాడు జోగారావు.

అప్పుడు గదిలో ఒక నవ్వు వినిపించింది. అది ఇందాకా వకుళ నవ్విన నవ్వులాగే వుంది.

"ఎవరో నవ్వారు కదండీ!" అంది శారద.

"నాకేం వినబడలేదే—నా మాట విని సుఖంగా నిద్రపో—" అన్నాడు జోగారావు. నిజానికి ఆ నవ్వు అతడికీ వినిపించింది.

(ఇంకా వుంది)